క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పి.శ్రీనివాస్ తెలిపారు. జేఎస్ఎస్‌యూఆర్ఎం ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జేఎన్‌యూఆర్ఎం గృహాలు, స్నేహితహిల్స్, అప్పా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అప్పా అకాడమీ, ఉమాపతి ఫామ్ హౌస, గేస్ట్‌హౌస్, హర్బల్ గార్డెన్, అజీజ్‌నగర్, డీర్ పార్క్ తదితర ప్రాంతాల్లో ఉండదన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

శంషాబాద్ రూరల్: మండలంలోని రషీద్‌గూడ పంచాయతీ అనుబంధ గ్రామం పోశెట్టిగూడలో బుధవారం సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ రాణి భూమి పూజ చేశారు. రూ. 12.50 లక్షల నిధులతో ఈ పనులు చేపట్టనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు మల్లారెడ్డి, జగన్, ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్ మోహన్‌రావు, కోఆప్షన్ సభ్యురాలు లక్ష్మమ్మ, మాజీ వార్డు సభ్యుడు బి.ధన్‌పాల్‌రెడ్డి, నాయకులు రవి, ఈశ్వర్, కుమార్, రాములు, జనార్ధన్, సత్యనారాయణ, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

శంషాబాద్ రూరల్: మండలంలోని పిల్లోనిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను మహిళలకు తెలియజేశారు. పుట్టిన వెంటనే బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలు తాగించాలని సూచించారు. తల్లిపాలతో పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచ్ బుచ్చమ్మ సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జె.అనిత, కె.పద్మజ్యోతి, స్థానికులు రాఘవదేవి, మహిళలు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో నిరసన



మాట్లాడుతున్న రెవరెండ్ గ్లోరీ బాబు

శంషాబాద్: మణిపూర్ మారణకాండను నిరసిస్తూ శంషాబాద్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ గ్లోరీ బాబు, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ఏలియాబాబు ఆధ్వర్యంలో బుధవారం శంషాబాద్‌లో ప్రార్థనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ శాసన మండలి సభ్యులు సి.హెచ్.రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు. శంషాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ మండలం పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మణిపూర్ ప్రజలను కాపాడాలని శాసన మండలి సభ్యులు సి.హెచ్.రాజేశ్వర్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్, షాద్‌నగర్ నియోజకవర్గాల నుంచి వచ్చిన దైవ సేవకులు రెవరెండ్ డాక్టర్ జి.విజయభూషణం, రెవరెండ్ జోసెఫ్ అంజన్న, రెవరెండ్ కె.సుందర్ పాల్, రెవరెండ్ పి.స్వర్ణకుమార్, జీ.జే.ప్రకాష్, రెవరెండ్ ఎం.ఎం.సామ్యూల్, రెవరెండ్ ఎ.మనోహరం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్‌వీఎస్ కబడ్డీ మీట్

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయ రీజనల్ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో జేఎన్‌వీ రీజనల్ స్థాయి కబడ్డీ పోటీలకు శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్‌నవోదయ విద్యాలయ వేదిక కానుంది. గురువారం ప్రారంభమయ్యే ఈ పోటీలు శనివారం వరకు కొనసాగుతాయి. ఈ పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుంచి మహబూబ్‌నగర్ క్లస్టర్‌నుంచి ఒక జట్టు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు, వెస్ట్‌గోదావరి నుంచి రెండు క్లస్టర్ల జట్లు, కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గ, కల్బుర్గి, తుంకూరుల నుంచి మూడు క్లస్టర్ల జట్లు, కేరళ, తమిళనాడుల నుంచి ఒక్కో క్లస్టర్ జట్టు పాల్గొంటాయి. ఈ 34వ రీజనల్ స్థాయి కబడ్డీ పోటీలను ఎన్‌విఎస్ హైదరాబాద్ రీజన్ డిప్యూటీ కమిషనర్ టి గోపాలకృష్ణ ప్రారంభిస్తారు. 5వ తేదీ పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు.

సింప్లిబిజ్- టీఏటీ క్యాపిటల్ ఎంఓయూ

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) పూర్వ విద్యార్థి స్థాపించిన హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ 'సింప్లిబిజ్‌తో ఆస్ట్రేలియా ఆధారిత కార్పొరేట్ అడ్వైజరీ, క్రాస్ బోర్డర్ చెల్లింపు సంస్థ టీఏటీ క్యాపిటల్ భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. బుధవారం జరిగిన వర్చువల్ ఈవెంట్‌లో ఐఎస్‌బీ పూర్వ విద్యార్థి, సింప్లీబిజ్ ఇండియా వ్యవస్థాపకుడు రఘుబాబు, టీఏటీ క్యాపిటల్ వ్యవస్థాపకుడు రామ్ గొర్ల ఒప్పందంపై సంతకాలు చేశారు.ఈ ఒప్పందంతో సహకారం, నైపుణ్యం, వనరుల మార్పిడికి అవకాశం కలుగుతుందన్నారు.

హెచ్‌ఎండీఏ భూముల్లో...
మళ్లీ ప్రైవేటు వ్యక్తుల పాగా!

- నిరంతరం కాపాలా ఉన్నా బోర్డులు పాతిన అక్రమార్కులు
- మార్చి 28న ఆపరేషన్ శంషాబాద్ చేపట్టిన హెచ్‌ఎండీఏ
- ప్రైవేటు వ్యక్తుల కబ్జా నుంచి రూ. 500 కోట్ల విలువైన భూములను ఆధీనంలోకి తీసుకున్న వైనం
- తాజాగా రెండు చోట్ల బోర్డులు పాతిన ప్రైవేటు వ్యక్తులు



హెచ్‌ఎండీఏ భూముల్లో అక్రమార్కులు తాజాగా పాతిన బోర్డులు

శంషాబాద్: వందల కోట్ల రూపాయల విలువ చేసే హెచ్‌ఎండీఏ భూముల వివాదం ఇంకా సమసిపోవడం లేదు. ఈ ఏడాది మార్చి 29 'ఆపరేషన్ శంషాబాద్ చేపట్టిన హెచ్‌ఎండీఏ అక్రమార్కుల కబ్జా చేసిన సుమారు రూ. ఐదొందల కోట్ల విలువ చేసే భూములను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. భూములన్నింటికీ ఫెన్సింగ్ వేయడంతో పాటు హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు ప్రైవేటు సెక్యూరిటీని సైతం భూములకు కాపలాగా పెట్టడంతోపాటు హెచ్‌ఎండీఏ స్థలాలుగా పేర్కొంటు బోర్డులు ఏర్పాటు చేశారు. భూములకు కాపలా ఏర్పాటు చేసినా అక్రమార్కులు మరోమారు సదరు భూముల్లోకి ప్రవేంచి భూములు తమవేనంటూ బోర్డులు పాతడంతో సమస్య మళ్లి మొదటికే వచ్చిందా అనే ఆందోళన కలిగిస్తోంది.

అసలేం జరిగింది?

పట్టణంలోని సర్వే నంబర్: 720 మొదలు కొని సర్వే నంబర్: 730 వరకు ఉన్న 183 ఎకరాల స్థలాన్ని 1990లో హెచ్‌ఎండీఏ యాభై మందికి పైగా రైతుల నుంచి సేకరించింది. ఇందుకు సంబంధించిన పరిహారాన్ని 2011 వరకు చెల్లించింది. ఇందులో నర్సరీలు ఏర్పాటు చేసింది. పదిహేనేళ్ల కిందట ట్రక్‌పార్కు స్థలాన్ని కేటాయించినా అది కార్యరూపం దాల్చలేదు. ఇటీవల మున్సిపాలిటీ కార్యాలయంతో పాటు మోడల్ మార్కెట్‌కు సైతం హెచ్‌ఎండీఏ భూములను కేటాయించింది. అన్ని భూములు పోలు మరోయాభైకి పైగా ఖాళీగా ఉన్న భూముల్లో ఈఏడాది ఫిబ్రవరిలో కొందరు ముఖ్య నేతల అండతో అక్రమార్కులు రంగంలోకి దిగారు. ఇందులో వేసిన కొన్న గదులకు మున్సిపాలిటీ అధికారులు సైతం తప్పుడు మార్గంలో ఇంటి నంబర్లు కేటాయించడంతో దాంతో దొడ్డిదారిన రిజిస్ట్రేషన్‌లు సైతం జరిగాయి. అక్రమార్కుల భూములు ఆధీనంలోకి తీసుకున్న నెల రోజుల తర్వాత తేరుకున్న హెచ్‌ఎండీఏ మూడు గంటల పాటు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి అక్రమ కట్టడాలను మొత్తం కూల్చివేసింది. భూములకు ఫెన్సింగ్ చేయడంతోపాటు కాపాలాను కూడా ఏర్పాటు చేసింది.

బరితెగింపు...

హెచ్‌ఎండీఏ కాపాలను సైతం లెక్క చేయకుండా హెచ్‌ఎండీఏ బోర్డులు తొలగించి అక్రమార్కులు అక్కడే తమ పేర్లతో పాటు కోర్టులో వేసిన పిటిషన్ నంబరు వేసి బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ విషయమై హెచ్‌ఎండీఏ సిబ్బంది సైతం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. మొత్తం మీద ప్రభుత్వానికి చెందిన కోట్లాది రూపాయల భూముల తీరు అస్తవ్యస్తంగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ల రద్దుకు నివేదిక...

అక్రమార్కులు హెచ్‌ఎండీఏ భూములో అక్రమంగా ఇంటి నంబర్లు చేయించుకోవడంతోపాటు దాని ఆధారంగా చేయించుకున్న రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాల్సిందిగా పదిహేను రోజుల కిందట హెచ్‌ఎండీఏ సైతం శంషాబాద్ రిజిస్ట్రార్‌ను కోరింది. ఈ మేరకు శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ సైతం వీటి రద్దుకు సంబంధించి ఉన్న అంశాలను జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. మొత్తం మూడు రిజిస్ట్రేషన్‌లు తొలగించేందుకు కలెక్టర్‌కు నివేదించినట్లు సబ్‌రిజిస్ట్రార్ సిద్ధిఖి 'సాక్షి'కి తెలిపారు.

అర్హులందరికీ అభివృద్ధి ఫలాలు



నార్సింగిలో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అర్హులందరికీ ఇపుడిపుడే అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని సౌకర్యాలను కల్పించే దిశగా పనులు చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని 16వ వార్డులో రూ. 20 లక్షలతో మైనార్టీ కమ్యూనిటీ హాల్, రూ. 40 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రూ. 20 లక్షలతో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, 7వ వార్డులో రూ. 60 లక్షలతో డ్రైనేజీ పనులు, 8వ వార్డులో రూ. 90 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 35 లక్షలతో అదే వార్డులోని వీకర్‌సెక్షన్ కాలనీలో మరో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 1.25 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు, 17వ వార్డులో రూ. 70 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు, 18వ వార్డులో రూ. 40 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు, బాలాజీనగర్ కాలనీలో రూ. 45 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు, అదే కాలనీలో మరో చోట రూ. 44 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు, 9వ వార్డులో రూ. 25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డును మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మున్సిపాలిటీలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీలు విస్తరిస్తున్నాయని, వాటిల్లో నివసించేందుకు వచ్చే వారికి అన్ని రకాల సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. మున్సిపాలిటీలలో ప్రజావసరాల మేరకు నిధులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రజలకు అవసరమైన అన్ని రకాల పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు పత్తి శ్రీకాంత్‌రావు, జి.అరుణజ్యోతి, టి.నరేష్, ఆర్. ఆదిత్యరెడ్డి, జి.శివారెడ్డి, పత్తి ప్రవీణ్‌కుమార్, ఉషారాణి, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పి.చంద్రశఖర్‌రెడ్డి, నాయకులు ఆర్.నర్సింహా, గోపాలగణేష్, హరిశంకర్, జితేందర్,ప్రియదర్శిని, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రంగస్థల నటుడిగా వేము వందనం



అవార్డు అందుకుంటున్న వేము వందనం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ భవానీ కాలనీకి చెందిన రంగస్థల కళాకారుడు, కవి వేము వందనంకు 2023 సంవత్సరపు ఉత్తమ రంగస్థల నటుడు అవార్డును అందించారు. మంగళవారం రాత్రి త్యాగరాయ గాన సభలో ఆలూరి కల్చర్ సోషల్ ఆర్గనైజేషన్ సంస్థ 21వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ రంగాలలో ప్రతిభ చూపిన వారికి అవార్డులు అందజేశారు. 70 సంవత్సరాల వయస్సు ఉన్న వేము వందనం 50కిపైగా అవార్డులు 400లకు పైగా బహుమతులు అందుకున్నారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ అవార్డులను ఆయన స్వీకరించారు. వేము సాహితి సంస్కృతి సేవా సంస్థను ఏర్పాటు చేసి కలలను పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ అవార్డు ద్వారా తనకు మరింత ఉత్సాహం వచ్చిందన్నారు. కళామతల్లికి సేవ చేయడం పూర్వ జన్మ సుకృతం అన్నారు. కలలను కాపాడుకోవాలంటే పిల్లలను బహుముఖ ప్రజ్ఞాశాలులుగా తీర్చిదిద్దాలన్నారు. తనకు ఉత్తమ రంగస్థల అవార్డు ఇచ్చిన ఆలూరు కల్చర్ సోషల్ ఆర్గనైజేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు మ్యాప్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: ప్రజలు సౌకర్యార్థం నిర్వహించే అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. సన్‌సిటీ బాలాజీ పాపాలాల్ నుంచి రిచ్‌మండ్ విల్లా వరకు ఉన్న రోడ్డును అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ అధికారిని ద్వారా మాస్టర్ ప్లాన్ రోడ్ మ్యాప్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్ఆర్‌డీసీఎల్ సంస్థ చేసే రోడ్డు పనుల గురించి తెలుసుకొని పలు సూచనలు సలహాలు అందజేశారు. టీపీఎస్ విజయలక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యాదయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు నైపుణ్యతపై శిక్షణ



మేనేజ్‌లో శిక్షణ పొందిన యువతతో అధికారులు

- ఇప్పటి వరకు 50 వేల మంది యువతకు శిక్షణ
- మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ చంద్రశేఖర

ఏజీవర్సిటీ: వ్యవసాయం సహా అనుబంధ సంస్థల గురించి గ్రామీణ యువతకు నైపుణ్యంలో శిక్షణ ఇచ్చామని.. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి ఇప్పటి వరకు 50 వేల మందికి శిక్షణ ఇచ్చినట్టు నేషనల్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.చంద్రశేఖర అన్నారు. బుధవారం మేనేజ్‌లో యువత నైపుణ్యత శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర మాట్లాడుతూ... వ్యవసాయ వ్యాపార సామర్థ్యాన్ని వెలికితీయడంలో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇచ్చామన్నారు. యువతలో స్వయం ఉపాదిని ప్రోత్సహించడానికి నైపుణ్యం కల్గిన మానవ వనరులను సృష్టించడానికి వ్యవసాయం, ఉద్యానవనం, పశుపోషణ, పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ, వృత్తిపరమైన రంగాలలో నైపుణ్యత యువతలకు అవసరమని అన్నారు. దీంతో పాటు కంపోనెంట్ కింద కవర్ చేసిన కొన్ని పాంతాలలో వర్మీకం పోస్ట్, ఫిషరీస్, పుట్టగొడుగులు ఉత్పత్తి, నర్సరీ పెంపకం, విత్తనోత్పత్తి, పరిశుభ్రమైన పాల ఉత్పత్తి, పశువుల పెంపకం, వ్యవసాయ యాంత్రీకరణ తదితర వాటిపై వర్క్‌షాప్ నిర్వహించామని ఆయన వివరించారు. రాష్ట్ర వ్యవసాయ నిర్వహణ, విస్తరణ శిక్షణ సంస్థలు, ఆత్మా, కేవీకేఎస్, ఎన్‌టీఐ వంటి వివిధ శిక్షణా భాగస్వామ్య సంస్థలలో కలిసి మేనేజ్ శిక్షణ ఇచ్చామన్నారు. 26 రాష్ట్రాల నుంచి 50 శిక్షణ టీంల తయారు చేసి వారి ద్వారా యువతకు నైపుణత ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం స్కిల్‌డెవలప్‌మెంట్ గ్రామీణ యువతకు సాధికారిత అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. వ్యవసాయం దాని అనుబంధ రంగంలో 21 రాష్ట్రాల నుంచి అందించిన మొత్తం 100 విజయగాథలు ఈ పుస్తకంలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ సంజయ్ ఖలీకర్, మేనేజ్ అధికారులు, యువత పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలను ఉచితంగా అందజేస్తున్నట్లు మైలార్‌దేవ్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారి వెల్లడించారు. బుధవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గురువారం నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ప్రభుత్వం తరపున వేస్తామన్నారు. ఈ మాత్రలను భోజనం తరువాత వేసుకోవాలని సూచించారు. గురువారం వేసుకోలేకపోయిన విద్యార్థులకు ఈ నెల 10వ తేదీన మాత్రలను వేస్తామని తెలిపారు.



డిపో వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ తదితరులు

ఆర్టీసీ కార్మికుల సంబరాలు

రాజేంద్రనగర్: ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం చేయడం చరిత్రాత్మక నిర్ణయం అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్, డివిజన్ కార్పొరేటర్ అర్చనజయప్రకాష్ వెల్లడించారు. బుధవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో ముందు కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజా రవాణాను మరింత పటిష్ట పరిచేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సరైన సమయంలో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం ద్వారా ఆర్టీసీ రానున్న రోజుల్లో మరింత ప్రగతిపథంలో పయనించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీకాంత్, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్, నేతలు సాయిమాలిక్, అక్కిరాజు రాదేశ్యామ్, మజ్జిగ నరేష్‌యాదవ్, కార్యకర్తలు, ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

హోంగార్డులను క్రమబద్ధీకరించాలని వినతి

మణికొండ: చాలీచాలని జీతాలతో పోలీసులతో సమానంగా హోంగార్డులుగా పనిచేస్తున్నామని తమనూ క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా చేయాలని హోంగార్డులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను పలువురు హోంగార్డులు కోరారు. బుధవారం నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం.ప్రవీణ్ యాదవ్ ఆధ్వర్యంలో వారు ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హోంగార్డుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు పి.మాణిక్యం, పి.మల్లప్ప, జి.శంకర్ మాట్లాడుతూ... రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన కొత్తలోనే తమను క్రమబద్ధీకరించి మంచి జీతాలను చెల్లిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇటీవల వీఆర్ఏలు, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినట్టే తమనూ పోలీసులుగా చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మంచిరేవుల శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ పొన్న రమేష్, హోంగార్డులు కె.మల్లేష్, జి.శివకుమార్, ఎం.రాజు, కె.ఐలేష్, పి.సురేష్, ఎం.యాదగిరి, బి.సత్యనారాయణ, ఎ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిమ్, కిడ్స్ ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాలని వినతి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్ అన్నారు. బైరాగిగూడ సుబ్రహ్మణ్యం ఫేస్-3 కాలనీలో ఓపెన జిమ్, కిడ్స్ ప్లే ఎక్విప్‌మెంట్ కోసం చర్యలు చేపట్టాలని బుధవారం కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కాలనీ కాలనీ అధ్యక్షుడు ఎం.రమేష్, ప్రధాన కార్యదర్శి డి.మహేష్, సలహాదారులు కె.మోహన్‌తో కలిసి ఆయన కావాల్సిన సదుయాలను కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్ మాట్లాడుతూ కాలనీలో ఓపెన్ జిమ్, కిడ్స్ ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయడం అనేది ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడమే కాకుండా సమాజ బంధాన్ని పెంపొందించగలదన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని వెంటనే తగు ఏర్పాట్లు చేసి సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు.

మహిళా ఉద్యోగుల భద్రత కోసమే షీ షటిల్ బస్సులు

సైబరాబాద్ కమిషనరేట్ అదనపు సీపీ అవినాష్‌మహంతి

రాయదుర్గం: ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ ప్రాంతాలలో పనిచేసే మహిళా ఉద్యోగులకు భద్రతతో కూడిన ప్రయాణం కోసమే షీ షటిల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు సైబరాబాద్ అదనపు సీపీ అవినాష్‌మహంతి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఎస్‌సీఎస్‌సీ పర్యవేక్షణలో ఎవినియోన్ ఇండియా 25వ వార్షికోత్సవం సందర్భంగా సీఎస్ఆర్ చొరవతో ఏర్పాటు చేసిన షీ షటిల్ 18వ బస్సును బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఇతర పోలీసు అధికారులు, ఎస్‌సీఎస్‌సీ, అవినియోన్ ఇండియా సంస్థల ప్రతినిధులతో కలిసి బస్సులో ప్రయాణించారు. కాగా 18వ షీ షటిల్ బస్సు బాలానగర్ వై జంక్షన్ నుంచి కూకట్‌పల్లి వై జంక్షన్ మీదుగా ఎవినియోన్ ఇండియా ప్రైవేట్ లిమిడెట్‌కు వచ్చేలా నడపాలని నిర్ణయించారు. ఈ మార్గంలో ప్రయాణించే ఐటీ మహిళా ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని సైబరాబాద్ పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ, ఏవినియోన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధికారులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఐటీ సంస్థలు, ఎన్‌జీవో సంస్థలు, దాతలు చేయూత నివ్వాల్సిన అవసరం ఎంతో ఉందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఓపెన్‌టెక్స్, యూత్ ఫర్ సేవా ఎన్‌జీవో సంస్థల వారు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టేషనరీని ఆయన చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందుల కారణంగానే వారు ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్నారని, అలాంటి వారికి సౌకర్యాలు కల్పిస్తే రాబోయే రోజుల్లో ఉన్నత స్థానాలను వెళతారన్నారు. అలాంటి విద్యార్థులకు చేయూత నిస్తున్న సంస్థలకు తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, కోఆప్షన్ సభ్యుడు జె.సిద్ధప్ప, నాయకులు బి.శ్రీరాములు, సి.బీరప్ప, బి.రవికాంత్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల కాలనీల్లోనూ పనులు చేయండి



మణికొండ క్వార్టర్స్‌లో పర్యటిస్తున్న కౌన్సిలర్, ఏఈలు

మణికొండ: పేదలు నివసిస్తున్న మణికొండ క్వార్టర్స్ కాలనీలో అనేక సమస్యలను పరిష్కరించటంతో పాటు చేపట్టాల్సిన రోడ్లు, కమ్యూనిటీహాల్, ప్యాచ్ వర్క్‌లు, విద్యుత్ స్థంభాల ఏర్పాటు లాంటి సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని 16వ వార్డు కౌన్సిలర్ పి.శైలజ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం ఆమె ఏఈ సాయిమానికతో కలిసి కాలనీలో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ... ప్రజలు తెలిపిన సమస్యలన్నింటినీ తీర్చాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రాబోయే కౌన్సిల్ సమావేశంలో వీటిపై తీర్మానం చేస్తామని, వెంటనే పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో దివ్యజ్యోతి యువజన సంఘం చైర్మన్ వెంకటరెడ్డి, అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నరేష్, కాలనీ వాసులు బలవంత్‌రెడ్డి, నరసింహా, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.